1. ఆపత్కాలమునందు - ప్రాపయి మానవజాతి - కాపయి సంరక్షించి - ఏపారును = పాపాంధకారమున బడి మ్రగ్గి శోకించు - పాపజాతికి దీప రాశియై రహియించు - కృపయు కనికరములు గుంఫించి - మధురాతి- ప్రభగా భాసిల్లెడు పరమార్థము - అపభ్రంశకార్యముల కెపుడు తావీయక- సుపురోగతిని జూపి శోధించును ॥పరి॥

2. బందలనుపమించు - గుండియల కదలించు - నిండుశక్తి ఘటించు నీతి బెంచు = ఎండిన యెదలను నిండించు రక్షణో - ద్దండ విలసిత భాగ్య దానమ్ములు - దండిగానసమాన ధైర్యోత్సాహములిచ్చి- మెండుగా నాదరము మేళవించి - మండుచున్న పాప మరణాగ్ని జ్వాలల - నుండి పాపిని గాచు నండయౌచు ॥పరి॥

3. శాంతి సమాధాన -సౌజన్యభావమ్ము- కాంతిమంతము గల్గు కారుణ్యము= అంతములేనట్టి - ఆనంద శుద్ధాత్మ శాంతిదాంతియొసంగి సంరక్షించు = ఎంతో సంతోషముతో - అంతుబొంతులేని వి -క్రాంతి బలత్యాగముల - గావింప జేయు - చింతా ధ్వాంతములోన - చెదరికొట్టుకపోవు - శాంతిలేని జనతకు - సౌఖ్యాస్పదము ॥పరి॥

- నురగాల తిమోతీ జ్ఞానానందము

## 248 పరిశుద్ధాత్ముడా - దిగిరమ్ము

రా - కమాసు (చాయ: చూచుచున్నాము నీ వైపు) తా - త్రిపుట

పరిశుద్ధాత్మా పావురమా - నీ దాసులపై - కరుణతో నరుదెంచుమా = పరిశుద్ధుడగు యేసు - పరమున కరిగి యా - దరణకర్తగ నిన్ను - దయచేసె గద మాకు ॥పరి॥

1. తండ్రి కుమారాత్మల - యేకాత్మవై - యుండిన పావనుడా = నిండార నీ యాత్మ - నండగ మాకొసగి - దండిగ వరముల -దయచేయు మోదేవ ॥పరి॥

2. విధిగ వేదము జదివిన - వేమారుసద్బోధల నాలించినా = సదయుడ నీ శక్తి - హృదయాల లేకున్న - కదలింపబడలేని -కలుషాత్ములము తండ్రి ॥పరి॥



3. సత్యస్వరూపా రమ్ము - మమ్ముల సర్వ - సత్యములో నడుపుము = సత్యాత్మా నీ శక్తి-సంపత్తితో దైవ - కృత్యము లొనరింప -గ్రుమ్మరింపుమా శక్తి ॥పరి॥

4. వాక్యమందలి భావముల్ - లోతుగ దరచి - వచియింప దరమె మాకు = వాక్యోప దేశివిగా - వచ్చి మాలో నిలచి - వాక్యమందలి జీవ - భావాలు దెలుపుమా ॥పరి॥

5. సాధక బాధకముల - నిలయంబైన - సంసార సాంద్రములో= ఆదరణ కర్తవుగా - నరుదెంచి మా సర్వ - బాధల దొలగించి - మోదంబు గూర్చుమా ॥పరి॥

-వి.డి. జాన్ సుందరరావు

## 249 మార్గదర్శియగు పరిశుద్ధాత్ముఁడు

రా - ఆనందభైరవి (చాయ: ఓ మా తండ్రి నీదు నామము) తా - ఏక

రమ్ము పరిశుద్ధాత్మ దేవుఁడా- మమ్మును గృపాస - నమ్ముకడకు - నెమ్మి నడుపుమా = మమ్ము నడుపు దీక్షతోఁబ - రమ్ము విడిచి యాత్మస్వరూ- పమ్మున నరుదెంచిన దై - వమ్ము నీవెకద యెహోవ ॥రమ్ము॥

1. లోకయాత్ర చేయునప్పుడు చీ - కాకుపడిన - మాకు నీవె మార్గ దర్శివై = వీఁక నొసఁగి - మాకరంబుఁ - జేకొని పరిశ్రమముఁబాపి - సిలువఁ బడినవానికడకు - శ్రేకమూని మమ్ముఁజేర్ప ॥రమ్ము॥

2. భక్తవన వసంతదైవమా- నీయందుఁ బ్రేమా - సక్తివృద్ధిచేసి మనుపుమా= ముక్తిదాత యేసువిభుని - రక్తమహిమఁ దెల్పియఘ వి-ముక్తులనుగఁజేసి మమ్ము - యుక్తమార్గమందు నిలుప ॥రమ్ము॥

3. జీవితంపుబాధ లెన్నియో - పెనుఁబ్రోవులగుచు - నావరించి మమ్ముఁ దా కిన = మాకు నీవె హితుఁడవగుచు - భావమిచ్చి భయముఁదీర్చి - జీవ మైన యేసుపాద - సేవకు మముసిద్ధపఱుప ॥రమ్ము॥

4. పలువిధంబులైన చింతలు - చెలరేఁగి మమ్ము - కలఁతపెట్టు నవసరం బున = వలనుచెడిన మామనముల - మలయు వ్యాకులతను మాన్పి - వలయు నాదరణము నిచ్చు - పలుకుదోడు వీవెయగుచు ॥రమ్ము॥